# మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

## హెచ్‌పివి టీకా పోస్టర్ ఆవిష్కరించిన ఎంపి, కలెక్టర్



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్:** మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మహబూబ్ నగర్ ఎంపి డి.కె.అరుణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మహబూబ్ నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఎంపి.డికే అరుణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపి డి.కె.అరుణ మాట్లాడుతూ మహిళలు చాలా సందర్భాల్లో కుటుంబం, ఉద్యోగ బాధ్యతల కారణంగా తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, వృత్తి జీవితాన్ని సమతుల్యంగా నిర్వహించగలరని తెలిపారు. అందువల్ల మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. మహిళలను ప్రమాదకరమైన గర్భాశయ క్యాన్సర్ నుంచి రక్షించేందుకు 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలకు ఉచిత హెచ్‌పీవి టీకాను కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. ఈ టికా తీసుకునేలా మహిళలు, మీడియా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎంపీ కోరారు. అనంతరం మహిళలతో కలిసి కేక్ కట్ చేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూగుప్తా మాట్లాడుతూ మహిళలు తమ శక్తి సామర్థ్యాలు గుర్తించి తమ తమ రంగాల్లో రాణించాలన్నారు. మహిళలందరికీ కలెక్టర్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహబూబ్ నగర్ మేయర్ జి.మమత మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత హెచ్.పి.వి టీకాను తీసుకొని గర్భాశయ, క్యాన్సర్ ను నివారించుకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు సృష్టికి మూలమని, మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరని అన్నారు. ఈ సందర్భంగా కళాజాత బృందం పాటలు పాడారు. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణ జిల్లా కలెక్టర్‌తో కలిసి హెచ్.పి.వి టికా కార్యక్రమానికి సంబంధించిన ఇంజక్షన్‌ను ఆవిష్కరించడంతో పాటు అవగాహన పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు, వయో వృద్ధులు, దివ్యాంగులు సంక్షేమ అధికారిణి జరీనా, డి.ఆర్.డి.ఓ నర్సింహులు, డి.ఎం.హెచ్.ఓ డా.కె,కృష్ణ , డి.ఎస్.ఓ. గంప శ్రీనివాస్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిని డి.సునీత, డి.పి.ఆర్.ఓ శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మాస్ మీడియా అధికారిని మంజుల, స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, సీనియర్ సిటిజన్ సంఘం సభ్యులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సి.డి.ఓలు, సూపర్వైజర్ లు, తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి

**ప్రజాపక్షం/గద్వాల రూరల్:** అమెరికా భరత్ వ్యవసాయ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని సంయుక్త కిసాన్ డిమాండ్ చేసింది. శనివారం గద్వాల మండలం అనంతపూర్, బీరెల్లి, లత్తిపురం తెలుగోనిపల్లి,జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో రైతులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య, రాష్ట్ర నాయకులు జి గోపాల్, న్యూ డెమోక్రసీ జమ్మించెడుకార్తీక్, మాస్ లైన్ హనుమంతు,తెలంగాణ రైతాంగ సమితి అధ్యక్ష కార్యదర్శులు కాజా, సత్య రెడ్డి, తదితరులు పాల్గొని మాట్లాడారు. అమెరికా భరత్ వ్యవసాయ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, విబిజి రాంజీ బిల్లును, విత్తన బిల్లును రద్దుచేసి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2025 విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహ రించాలని, యధావిధిగా కార్మిక చట్టాలను పునరుద్ధ రించాలని, ఎంఎస్ స్వామినాథన్ సిఫారసులను అమలు చేసి కనీస మద్దతు ధరలకు చట్టం చేయాలన్నారు. మార్చి 10నుండి ఏప్రిల్ 13 వరకు జరిగే రైతు సదస్సులను విజయవంతం చేయాలని కోరారు.

## ప్రమాదవశత్తు యువరైతు మృతి



**ప్రజాపక్షం/మాగనూర్ :** ప్రమాదవశత్తు కరెంట్ షాక్‌తో యువరైతు మృతి చెందిన ఘటన మాగనూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం బచ్చి దేవప్ప (32) శుక్రవారం పొలంకి వెళ్ళినట్టు తెలిపారు. పొలం దగ్గర స్టార్టర్‌లో కరెంటు ప్రాబ్లం చూస్తుండగా ప్రమాదవశత్తు కరెంట్ షాక్ తో అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. రాత్రి వేళలో ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు శనివారం ఉదయం చేసుకు వెళ్లి చూడగా స్టార్టర్ దగ్గర చనిపోయినట్లు తెలిపారు. ఈయనకు ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. పంట పొలాల పైను ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న బచ్చి దేవప్ప కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## తహసీల్దార్లుగా బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/పానుగల్/వీపనగండ్ల/పెబ్బేరు:** పానుగల్ మండల నూతన తాహసిల్దార్‌గా వెంకటేశ్వర్లు శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తాహసిల్దార్ సత్యనారాయణరెడ్డి పెబ్బేరు మండలానికి బదిలీ కావడంతో కొత్తకోట తాహసిల్దారుగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు బదిలీపై పానుగల్ మండలానికి వచ్చారు. పదవి బాధ్యతలు చేపట్టిన అనంతరం తాసిల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అందరూ కృషి చేయాలని ఆయన తెలిపారు.

వీపనగండ్ల మండల తాసిల్దార్‌గా జి.శివకుమార్ బాధ్యతలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పరిపాలన పరమైన కారణాలతో ప్రస్తుతం వీపనగండ్లలో విధులు నిర్వహిస్తున్న తాసిల్దార్ వరలక్ష్మి ని శ్రీరంగాపూర్ మండలానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నాయబ్ తాసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జి.శివకుమార్‌కు తాసిల్దార్ బాధ్యతలు అప్పగించారు. మండల తాసిల్దార్ కార్యాలయంలో సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

పెబ్బేరు మండల నూతన తాహసీల్దార్‌గా సత్యనారాయణరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన తాహసీల్దార్ లక్ష్మి బదిలీ పై సర్వే సెటిల్మెంట్ విభాగం హైదరాబాద్‌కు వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తాహసీల్దార్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ భూభారతి, ఇతర సర్టిఫికెట్లు, వివిధ అవసరాల కోసం వచ్చే వారు నేరుగా తనను కలవొచ్చని చెప్పారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. కాగా ఆర్ఐ రాఘవేంద్ర రావు, రెవెన్యూ సిబ్బంది మర్యావపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/కల్వకుర్తి:** కల్వకుర్తి మండల పరిధిలోని తుర్కలపల్లి గ్రామంలో గ్రామ మహిళ సంఘం నూతన భవనం కోసం శనివారం గ్రామ సర్పంచ్ లతశేఖర్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లతశేఖర్‌రెడి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వ ఎంతో కృషిచేస్తుందని, మహిళలను కోటిశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందన్నారు. తుర్కలపల్లి గ్రామానికి గ్రామ మహిళ సంఘం భవనం మంజూరు చేసిందుకు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఏఇ , గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు మొగులాల్ ,శివప్రసాద్,నీలమ్మ,వెంకటయ్య,యువజన కాంగ్రెస్ నాయకులు అన్వర్ పాషా,మట్ట కృష్ణయ్య,వెంకటయ్య,గ్రామ ప్రజలు,గ్రామ పంచాయితీ సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

## కళాశాలలో మొక్కల వ్యర్థాలు తొలగింపు

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపల్ భగవేణి నర్సింహులు,కళాశాల అధ్యాపకులు ఆవరణలోని పిచ్చి మొక్కలతో పాటు ఇతర వ్యర్థాలను తొలగించి కళాశాల తరగతి గదులను శుభ్రం చేశారు. ఇంటర్ విద్యా కమిషనర్ అదేశాల మేరకు కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పరంగా చేపట్టవలసిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అంశాలను అధ్యాపకులకు వివరించామని ప్రజాపాలనలో భాగంగానే శనివారం కళాశాల ఆవరణలో గల పిచ్చి మొక్కలను తొలిగించామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ భగవేణి నర్సింహులు తెలిపారు.





## దొంగతనాల పట్ల అప్రమత్తం

### అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి : ఎస్పీ

**ప్రజాపక్షం/దామరగిద్ద :** దామరగిద్ద మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, దేవాలయ పూజారులతో దామరగిద్ద పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాజు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో భద్రతను మరింత బలోపేతం చేయడం, దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ గ్రామాల్లోని దేవాలయాలలో ఉన్న విలువైన అభరణాలు, ఇతర వస్తువులను భద్రత దృష్ట్యా బ్యాంకుల లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. అలాగే దేవాలయాలకు పటిష్టమైన అలాగే దేవాలయాలకు పటిష్టమైన లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరిస్తే నేరాలను సమర్ధవంతంగా అరికట్టవచ్చని ఎస్సై తెలిపారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది, మండల పరిధిలోని సర్పంచులు, ఉపసర్పంచులు, దేవాలయ పూజారులు , గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

### పిహెచ్‌సి పరిశుభ్రతపై వైద్యులపై కలెక్టర్ ఆగ్రహం



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పిహెచ్‌సి పరిశుభ్రతపై వైద్యులపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తెల్కపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అకస్మీకంగా సందరర్శించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమంలో తొలి థీమ్‌గా చేపట్టాల్సిన పరిశుభ్రత కార్యక్రమాలు ఎందుకు నిర్వహించలేదని వైద్యులను జిల్లా కలెక్టర్ ప్రశ్నించారు. పరిశుభ్రత కార్యక్రమాలు ఒక రోజు ముందుగానే చేపట్టాలని అదేశించిన పప్పటికి అమలు చేయకపోవడంతో కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై అధికారులు ఉదాసీనంగా ఉండవద్దని, 99 రోజుల పనిచేసిన వారికి ప్రశంసలు, పని చేయని వారికి చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

**విద్యార్థులకు మనూ ప్రకారం పౌష్టికాహారం అందాలి**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించడంతో పాటు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. శనివారం తెల్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ అకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కిచెన్‌ను సందర్శించి కూరగాయాలు తాజాగా ఉన్నాయా లేవా అని పరిశీలించారు.వంట సరుకుల నాణ్యతను తనిఖీ చేసి, మెనూ ప్రకారం విద్యార్థులకు గుడ్లు అందజేయాలని సూచించారు. రానున్న పదవ తరగతి ఫలాతాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధజంచేలా ప్రతి విద్యార్థికి మెరుగైన భోదన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ వెంట డిపిఓ శ్రీరాములు,తెల్కపల్లి కొమ్ము చంద్రశేఖర్,పాఠశాల హెచ్ ఎం శోభన్‌బాబు తదితరులు ఉన్నారు.

# రెవెన్యూ శాఖలో అవినీతి జాతర.. పైసా లేనిదే పని జరగదు



**ప్రజాపక్షం/గద్వాల:** జోగులాంబ గద్వాల జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. సాధారణ పౌరుడు తన భూమికి సంబంధించిన చిన్న ధ్రువీకరణ పత్రం కావాలన్నా లేదా వారసత్వ మార్పిడి విరాసత్ చేయించుకోవాలన్నా, అధికారుల చేతులు తడపనిదే ఫైలు ముందుకు కదలడం లేదు పైసా లేనిదే పని కాదు అనే నినాదం జిల్లాలోని గద్వాల మల్దకల్ అయిజ గట్టు కేటీ దొడ్డి మండలాల్లో బలంగా వినిపిస్తోంది. అంటెండర్ నుండి అధికారి వరకు.. అంతా మామూళ్ల పర్వమే కార్యాలయాలో అడుగు పెట్టినప్పటి నుండి పని పూర్తియ్యే వరకు ప్రతి అడుగునా లంచం అడుగుతున్నారని బాధితులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి సర్టిఫికేట్ల కోసం రూ.1,000 నుండి మొదలై భూముల రిజిస్ట్రేషన్లు లేదా మ్యుటేషన్ల కోసం రూ.5,000 నుండి రూ. 10,000 వరకు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. అధికారులు దళారులు కుమ్మక్కై సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూములకే ఎసరు... నిబంధనలు తుంగలో కొందరు అధికారులు కేవలం కాసుల కక్కుర్తితో ప్రభుత్వ భూములను సైతం ప్రైవేట్ వ్యక్తుల పేరు మీద మార్చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ఇనామ్ భూములు వీటి రిజిస్ట్రేషన్ కోసం బహిరంగానే వేలల్లో డిమాండ్ చేస్తున్నారు. వారసత్వ మార్పిడి ఒక రైతు మరణిస్తే అతని కుటుంబ సభ్యుల పేరు మీద భూమిని మార్చడానికి కూడా రూ. 10,000 వసూలు చేస్తున్న ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. దళారుల హవా మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్నప్పటికీ దళారుల ప్రమేయం లేనిదే ఫైలు ఆమోదం పొందడం లేదని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలి నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గద్వాల జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వేలల్లో జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఇలా సామాన్యులను పీడించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి రెవెన్యూ శాఖలో ప్రక్షాళన చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



## పది విద్యార్థులకు ప్రేరణాత్మక తరగతులు

**ప్రజాపక్షం/ఉట్కూర్:** ఉట్కూర్ మండలంలోని చిన్నపొర్లలో పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదవ తరగతి విద్యార్థులకు టీఎస్‌యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రేరణాత్మక తగరతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేత స్టడీ సర్కిల్ విద్యావేత్త వెంకట్‌రెడ్డి విద్యార్థులకు పరీక్షల సమయంలో ఉండే భయం పరీక్షలు రాస్తున్నప్పుడు పాటించాల్సిన మెలకువలు గురించి వివరించారు. తన ప్రేరణాత్మక ప్రసంగంతో విద్యార్థులను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో చిన్నపొర్ల గ్రామ సర్పంచు నికిత ప్రశాంత్, ఉపసర్పంచు సంజీవ్, రిటైర్డ్ జిహెచ్‌ఎం భాస్కర్ రెడ్డి, పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు నరేందర్, టీఎస్‌యుటిఎఫ్ ఉట్కూర్ మండల అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి మోహన్, జిల్లా నాయకులు శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు శేషప్ప, తిరుపతి నాయక్, ఆనంద్, స్వప్న, శ్రీనివాసులు, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## విద్యతోనే మహిళాభ్యున్నతి



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** విద్యతోనే మహిళాభ్యున్నతి, మహిళా సాధికారిత సాధ్యమని, మహిళలు అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణించాలని నారాయణపేట జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణిందర్ రెడ్డి సూచించారు. సమాజంలో మహిళలకు పురుషులతో పాటు సమాన హక్కులు, అవకాశాలు ఉండాలని ఆయన అభిప్రాయ పడ్డారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షే మ శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్. గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యుసీ అశోక్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మంజుల, మహిళా కౌన్సిలర్లు కందన్ పల్లి సత్యమ్మ, జయశ్రీ, భాగ్యవతి, అరుణ, బండి రాజేశ్వరి, కల్పన రఘు రామయ్య, శ్వేతా వెంకటేష్, డిడబ్ల్యుఓ కార్యాలయ ఉద్యోగులు సాయి, నర్సిములు, శైలజ, కరిష్మా, భారతి, సఖి సెటర్ నిర్వాహకురాలు క్రాంతి రేఖ, అంగన్ వాడీ టీచర్లు, పట్టణ మహిళా సంఘాల సభ్యులు, సెర్ఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి

### నీటి పారుదల శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్:** వనపర్తి నియోజకవర్గ పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులు, కెనాల్‌లు, పంట కాలువలు, చెక్‌డ్యాంల లాంటి అనేక వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి వనపర్తి జిల్లా నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనుల గురించి అధికారులతో చర్చించారు. గట్ల ఖానాపురం రిజర్వాయర్ ఏర్పాటులో తలెత్తే పలు పాఠశాలపై వారు చర్చించారు. అదే విధంగా బుద్దారం స్టేజ్ 2 గణప సముద్రం రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించిన పలు సమస్యలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో సిఈ నాగేంద్రరావు, ఎస్‌సి చంద్రశేఖర్, ఈఈ జబేర్ అహ్మద్, డిఈసీ వెంకట్‌రెడ్డి , డీఈ,ఏఈ లు పాల్గొన్నారు.



## సబ్ ప్లాన్ నిధుల ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్:** రాష్ట్రంలో దళితులు, ఆదివాసుల అభివృద్ధి కోసం కేటాయిస్తున్న ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వినియోగం పై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, డి మాండు చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నప్పటికి ఆ నిధులు నిజంగా దళితులు అభివృద్ధికే ఖర్చవుతున్నాయా లేదా అన్న విషయంపై స్పష్టత లేకపోవడం ఆందోళనకరమని మారుపాక అనిల్ కుమార్ అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) వనపర్తి జిల్లా రెండవ మహాసభ అజ్జపాడు భాస్కర్ అధ్యక్షతన సిపిఐ జిల్లా కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంకు అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ రాములు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.లక్ష్మి పతి హాజరైనారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం దళితులు, ఆదివాసుల జనాభా శాతానికి అనుగుణంగా నిధులు కేటాయించి, ఆ వర్గాల విద్య, ఉపాధి, ఆరోగ్యం, గృహాలు, భూమి పంపిణీ వంటి రంగాల్లో అభివృద్ధి కోసం ఖర్చు చేయాలి. దళితులు ఇంకా విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లో తీవ్ర వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో సబ్ ప్లాన్ నిధులు వారికి అత్యంత అవసరమని ఆయన చెప్పారు. అయినప్పటికీ ఈ నిధుల వినియోగంలో ప్రభుత్వం పారదర్శకత పాటించకపోవడం రాజ్యాంగ స్పూర్తికి విరుద్ధమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏ.రవీందర్, ఏ.భాస్కర్, మోష, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్, శ్యాం సుందర్, భరత్, శాంత మూర్తి, గాంధీ, దంగు కురుమయ్య, శేఖర్, శివకుమార్, వి.రాములు, చిన్న కురుమన్న, సహదేవుడు, చంద్రయ్య, రాంబాబు, ఇజ్రాయిల్, సొలు, శివ, అశోక్, వెంకటయ్య, శ్రీరామ్, వంశీ, గోపాలకృష్ణలు ఉన్నారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** జడ్చర్ల మున్సిపాలిటీలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక' కార్యక్రమాన్ని శనివారం రెండో రోజు విజయవంతంగా అమలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు జడ్చర్ల మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత, ప్రధానంగా వార్డు నెంబర్ 12 ను, వివిధ ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలను సందర్శించి సమగ్ర పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ పై దృష్టి సారించింది. ఈ కార్యక్రమంలో భాగంగా 12వ వార్డు పరిధిలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి విస్తృతంగా ఊడ్చే కార్యక్రమం నిర్వహించి, పరిసరాలను పరిశుభ్రం చేశారు. అదేవిధంగా డ్రైనేజీలను పూర్తిగా శుభ్రపరచడం, రోడ్ల పక్కన పెరిగిన పొదలు, పిచ్చి మొక్కలను తొలగించడం జరిగింది. వార్డులోని చెత్త కుప్పల పాయింట్లు (జివిపిలు) తొలగించడంతో పాటు, రహదారి రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న నిర్మాణాల కూల్చివేత (సి అండ్ సి), వ్యర్థాల తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ చర్యల ద్వారా రహదారుల యాక్సెస్ మెరుగుపడటంతో పాటు స్థానిక పారిశుద్ధ్యం కూడా మెరుగుపడింది అని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత తో పాటు, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ మేనేజర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసు విధులకు అటంకం కలిగించిన వ్యక్తులపై కేసు.. రిమాండ్‌కు తరలింపు



**ప్రజాపక్షం/కల్వకుర్తి:** పోలీసుల విధులకు అటంకం కలిగించిన ఇద్దరు న్యాయవాదులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని డిఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు.శనివారం డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ హైద్రాబాద్‌లో నివాసముంటున్న ఫృద్దీ సుప్రీం కోర్టులో, అంకంరావు హైకోర్టులో న్యాయవాదులుగా పని చేస్తున్నారన్నారు. వారు తమ స్వేహితులతో కలిసి శుక్రవారం బల్మూర్ మండలంలోని జినుకుంట గ్రామంలో వివాహానికి వెళ్లారు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో కల్వకుర్తిలోని సుభాష్ నగర్‌లో ఉండే నారాయణమూర్తి ఇంటి వద్ద మద్యం మత్తులో అతని ఇంటిపైకి మద్యం బాటిళ్లను విసిరేసి,ఇంటి యాజమాని మూర్తితో గొడవపడగా ఇరుగు పొరుగు వారు సర్దిచెప్పి వారిని అక్కడ నుండి పంచించారు. పట్టణంలోని హైద్రాబాద్ చౌరస్తాలో శనివారం ఉదయం 3 గంటలకు వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ రాజశేఖర్ 2 వారిని గుర్తించి కారు అపగా విధులలో ఉన్న పోలీసు సిబ్బందిపై తిట్టడంతో పాటు వారి విధులకు అటంకం కలిగించారని డిఎస్పీ తెలిపారు.వారు మద్యం తాగి ఉన్నారని గుర్తించి పోలీసులు వారి రక్త నమూనాలు సేకరించి, మద్యం తాగినట్లుగా నిర్ధారణ కావడంతో వారిని పోలీసు స్టేషన్‌కు తరలించి సర్దిచెప్పడానికి పోలీసులు ప్రయత్నించిన వారు ఎంతకు వినకుండా పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపైన నానా బూతులు తిడుతూ దూషించడంతో అక్కడే విధులలో ఉన్న కానిస్టేబుల్ రామకృష్ణ , నారాయణమూర్తి లు ఇచ్చిన ఫిర్యాదులతో వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేశామని డిఎస్పీ తెలిపారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా వారికి జడ్జి రిమాండ్ విధించినట్లు డిఎస్పీ తెలిపారు. వారి నుండి కారు స్వాదీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో సిఐ నాగార్జున,ఎస్ఐ మాధవరెడ్డి లు ఉన్నారు.

